# పల్లెపహాడ్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా రాణమ్మ శ్రీనివాస్

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండలంలోని పల్లెపహాడ్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించిన అభ్యర్థి సంగిశెట్టి రాణమ్మ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా రాణమ్మ తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. పల్లెపహాడ్ గ్రామ అభివృద్ధికి ప్రజలు అందరూ తన గెలుపు కోసం పని చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకరయ్య ఉన్నారు.





వివరాలు మెయిన్‌లో

నాగార్జునసాగర్ నుండి శ్రీశైలంకు లాంచి యాత్రను శనివారం ప్రారంభించారు. ఇది పర్యాట కులను ఎంతగానో ఆకట్టుకోవ డంతో సాగర్ వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు నాగార్జునసాగర్ నుంచి లాంచీ బయలుదేరి శ్రీశైలానికి సాయంత్రం 3 గంటలకు చేరుకుంటుందని మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీశైలం నుంచి బయలుదేరి నాగార్జునసాగర్‌కు సాయంత్రం 3 గంటలకు చేరుకుంటుంది. 9848540371, 9848125872 నెంబర్లను సంప్రదించి ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు.

ప్రజాపక్షం/నందికొండ

# ముగిసిన మొదటి విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

## రాత్రి వరకు లైన్‌లో నిలుచున్న అభ్యర్థులు

## తలనొప్పిగా మారిన కరెంట్ అకౌంట్ నిబంధన

## నేటి నుండి రెండవ విడత నామినేషన్స్ ప్రారంభం

**ప్రజాపక్షం/నల్లగొండ :** గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈనెల 27 నుంచి ప్రారంభమై శనివారం వరకు మూడురోజుల పాటు కొనసాగింది. జిల్లాలో నల్లగొండ, చండూరు డివిజన్ లో సర్పంచ్ ల, వార్డ్ మెంబర్ల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. మెదటి రోజు నామినేషన్ దాఖలు చేయడంలో నామమాత్రం జరగగా రెండో రోజు గురువారం అష్టం ఉండడంతో నామినేషన్ దాఖలు చేయడానికి అభ్యర్థులు అంత గా చొరవ చూపలేదు అయితే శనివారం చివరి రోజు కావడంతో సర్పంచ్, వార్డ్ నెంబర్లు అభ్యర్థులు అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడానికి నామినేషన్ క్లస్టర్ కార్యాలయానికి చేరుకున్నారు.మొదటి విడత 14 మండలాలలోని 117 క్లస్టర్లలో 318 గ్రామపంచాయతీలకు 318సర్పంచ్, 2870వార్డు సభ్యులకు నామినేషన్లు స్వీకరించారు. రాజకీయ పార్టీల నుంచి సర్పంచ్ అభ్యర్థులు పోటాపుటిగా తమ నామినేషన్లలో దాఖలు చేశారు. అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఇద్దరు చొప్పున రెబల్స్ నామినేషన్ వేశారు. అదేవిధంగా ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా పోటీపడి నామినేషన్ వేశారు. దీనితో ఉదయం నుంచి రాత్రి వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగింది. అయితే సర్పంచ్ వార్డ్ మెంబర్ ఎన్నికల ఖర్చులు చేయడానికి నూతన కరెంట్ అకౌంటు నామినేషన్ పత్రాలు ద్వారా జతచేయాలని నిబంధన ఉండడంతో అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. అభ్యర్థులు



అందరూ తమ తమ పాత బ్యాంకు అకౌంట్ తో నామినేషన్‌లు దాఖలు చేశారు. అయితే అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో బ్యాంకు ఖాతా, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించని పక్షంలో నామినేషన్ల పరిశీలన సమయం వరకు సమర్పించవచ్చని కుల ధ్రువీకరణపత్రాలు సమర్పించ లేకపోతే డిక్లరేషన్ ఫామ్‌లో గెజిటెడ్ సంతకంతో సమర్పించి, కరెంట్ అకౌంట్ లేనట్లైతే పోస్ట్ ఆఫీస్ పాస్ బుక్ ఇచ్చి నామినేషన్ల పరిశీలన లోపు ధ్రువీకరణ, బ్యాంక్ అకౌంట్ పత్రాలును అందజేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రకటించారు.

**నేటి నుండి రెండవ విడత ప్రారంభం**

పంచాయతీ ఎన్నిక పర్వం కొనసాగుతుంది మొదటి విడత ఎన్ని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియడంతో రెండవ విడత 10మండలాలలోని 252 గ్రామపంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఈనెల 30నుండి డిసెంబర్ 2వరకు మూడు రోజులపాటు కొనసాగుతుంది.

# ఎన్నికల్లో పొరపాట్లకు తావివ్వకుండా విధులు

## ఎన్నికల సాధారణ పరిశీలకులు అధికారి రవి నాయక్



వివరాలు మెయిన్‌లో



## రైతుల ఆకలి తీర్చడమే లక్ష్యం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఐదు రూపాయల భోజనాన్ని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ఎండి ఫసియోద్దీన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆకలి తీర్చడం కోసం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. సూర్యాపేట మార్కెట్‌కు వచ్చే రైతులు అందరూ ఐదు రూపాయల భోజనాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇప్పటికే మార్కెట్‌లో అత్యధిక ధాన్యం ధర రూ.3,186 పలకడంతో రైతుల కళ్లలో ఆనందం వెల్లివేర్చిందన్నారు. మార్కెట్‌లో రైతులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సదుపాయాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి వెంకటరెడ్డి, మార్కెట్ సిబ్బంది వెంకటేష్, ఖాసీం పాల్గొన్నారు.

## సేవ చేయడమే లక్ష్యంగా ఉద్యోగానికి రాజీనామా



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** గ్రామ ప్రజల సేవకే అంకితం అవ్వాలని కోదాడ టౌన్ ఎస్ఐ పులి వెంకటేశ్వర్లు తీసుకున్న నిర్ణయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇంకా ఐదు నెలల సర్వీస్ ఉండగానే గుడిబండ గ్రామ సర్పంచ్ పదవికి పోటీచేసేందుకు ఆయన స్వచ్ఛంద విరమణ విఆర్ఎస్‌కు అర్జీ సమర్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సమస్యలు పరిష్కరించడం నా జీవిత ధ్యేయం అన్నారు. ప్రజలకు మరింత దగ్గరగా చేరుకోవాలని ఆలోచనతోటే సర్పంచ్ పదవికి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తాను పుట్టిన గ్రామానికి సేవ చేయడం కోసం ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేయడాన్ని అందరూ అభినందిస్తూ గ్రామ పెద్దలు, యువత ఆయనకు మద్దతుగా ఉంటామని తెలిపారు.

## కీలక ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అతి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎండిఓ ఆర్.భాస్కర్ తెలిపారు. శనివారం పోచంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో కీలకమైన ఎన్నికల షెడ్యూల్, సామగ్రి పంపిణీ కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సీఈవో ఎస్.శోభారాణి ముఖ్య అతిథిగా హాజరై, ఎన్నికల పనులకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కీలక కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎ.సత్యనారాయణ రెడ్డి, ఎంపీఓ మహ్మద్ మజీద్, ఎంఈఓ ప్రభాకర్, ఆర్ఓ, ఏఆర్ఓలు అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## మంచి పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి



**ప్రజాపక్షం/గరిడేపల్లి :** ప్రతి ఒక్కరు వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునేందుకు మంచి పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్ వి నరేష్ కోరారు. శనివారం మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే క్యాంప్‌ను నిర్వహించారు. ఈ క్యాంపును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న, ఆల్కాహాల్, పొగ త్రాగే వారిని గుర్తుంచి ఎక్స్‌రే చేసినట్లు తెలిపారు. ఎవరికైనా క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే ఈ పరీక్ష ద్వారా గుర్తించడం జరుగుతుందని చెప్పారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తరపున ఉచితంగా ఆరు నెలల పాటు మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రెండు వారాలు మించి దగ్గు, జ్వరం, దగ్గినప్పుడు రక్తపు సారికలు పడడం, బరువు తగ్గిపోవడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఒక్కోసారి తెమడ పరీక్షలో నిర్ధారణ కాకపోయినా ఎక్స్‌రే పరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ సుష్మ, టిబి నోడల్ పర్సన్ ఎన్ అంజయ్య గౌడ్, ఎంఎల్‌హెచ్‌పి సాయికుమార్, అశోక్, ఎస్‌టిఎస్ మమత, ఎక్స్‌రే టెక్నిషియన్స్ పాల్గొన్నారు.

## క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, మనోధైర్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** క్రీడల ద్వారా దివ్యాంగులలో మానసిక ఉల్లాసం, మనోధైర్యం కలుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు అన్నారు. శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల క్రీడా పోటాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి డిసెంబర్ 3న జరిగే జిల్లా స్థాయి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. క్యారంబోర్డు, చెస్, పరుగుపందెం, షార్ట్‌పుట్ క్రీడలు నిర్వహించగా దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ, డిఇఓ అశోక్, జిల్లా యూత్, స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, సిడిపిఓ, సూపర్‌వైజర్లు, దివ్యాంగుల సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థి దశలోనే విద్యార్థులు నాయకత్వ అలవరుచుకోవాలని శివాని కరస్పాండెంట్ కుందూరు శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సంతోష్‌నగర్‌లో గల శివాని స్కూల్‌లో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, కలెక్టర్‌గా, డీఈవోగా, ఎంఈవోగా, కరస్పాండెంట్‌గా, ప్రిన్సిపాల్‌గా, ఉపాధ్యాయులుగా, పీఈటీలుగా విద్యార్థులు ఎస్.మనస్విని, ప్రసన్న, సాత్విక్, శివాని, నిక్షిత, అభి, స్వాతి, సుహాన, ఇందు, జ్ఞాన స్వరూప్, తరుణ్ పమర్, అశ్విత, లోహిత, దీక్షిత, వర్షిత, చరణ్‌తేజలు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందచేసి మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి చదివి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోని ఆ దిశగా ప్రయత్నించి విజయం సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హెజలో రసాయన పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** నిత్యం దుర్వాసన వెదజల్లుతూ వాతావరణ కాలుష్యానికి కారణం అవుతూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న హెజలో రసాయన పరిశ్రమపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పరిశ్రమను తరలించాలని కోరుతూ శనివారం పోచంపల్లి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ భువనగిరి జిల్లా, పోచంపల్లి మండలం పరిధిలోని అంతమ్మగూడెం గ్రామంలో ఏం/ఎస్ బృందావన్ గ్రామ సమీపంలో ఉన్న హెజలో లేబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమల నుండి విపరీతమైన దుర్వాసన రావడం వలన తాము గ్రామంలో నివసించుట దుర్భరంగా మారినదనీ పిల్లలు, వృద్ధులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనీ పరిశ్రమలు విడుదల చేయు కాలుష్యం నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మేకల చొక్కా రెడ్డి, అంతమ్మ గూడెం బూత్ అధ్యక్షుడు ఆస్పరి లింగయ్య, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు సురకంటి భూపాల్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.



## ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను గెలిపించండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే నాయకులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల కోసం ఉద్యమాలు చేసే ఎర్రజెండా అభ్యర్థులకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించినట్లయితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యకర్తలు కష్టపి పనిచేసి సీపీఎం పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, పరుశురాములు, రాగారెడ్డి మంగారెడ్డి, వినోద్‌నాయక్, రొండి శ్రీనివాస్, అయూబ్, తిరుపతి రామ్మూర్తి, రమేష్, చౌగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## నూతన వైన్స్‌లను తొలగించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని మెయిన్‌రోడ్డులో గల నూతన వైన్స్ షాపులను తొలగించాలని మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ కోరారు. శనివారం ఆయన సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించి మాట్లాడారు. దినదినాభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ పట్టణంలో లక్షలాది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని, పట్టణంలో స్కూల్స్, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ వ్యాపార సంస్థలు అనేకం ఉన్నాయని, పెరుగుతున్న జనాభాకు అనుగణంగా పట్టణంలో రోడ్ల విస్తరణ జరుగుతున్నందున నూతనంగా ఏర్పాటు చేస్తున్న వైన్స్ షాపులను మెయిన్ రోడ్లపై కాకుండా పట్టణ శివారులో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాలకు దూరం




**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జి.గోపాల్ శనివారం యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. యువత పొగాకు, గుట్కా, జర్దా, పాన్ మసాలా వంటివి తీసుకోవడం వల్ల నోటి, గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, టీబీ, గుండె జబ్బులు, బీపీ, షుగర్ వ్యాదులు వస్తాయని అన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. పొగాకు, మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం యువతచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మల్లేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## సాయిలు మృతి పార్టీకి తీరని లోటు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** సీనియర్ కాంగ్రెస్ నాయకులు కల్లెం సాయిలు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరొద్దిన్ అన్నారు. ఆయన మృతదేహాన్ని జమీరొద్దిన్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మొహమ్మద్ నాసర్, జెల్లా వెంకటేశం, కొత్తపల్లి అబ్రహంకుమార్, లెంకలప ప్రవీణ్, కొమ్ము శేఖర్, తదితరులు ఉన్నారు.





## డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలో డిసెంబరు11 నుండి జరిగే 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను అడిషినల్ డిఆర్డిఓ, తుర్కపల్లి మండలం ఎలక్షన్ ఇంచార్జి జి.సురేష్ పరిశీలించారు. ఎలక్షన్ కొరకు వచ్చిన బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలించి ఎలక్షన్ కొరకు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలోమండల పరిషత్ అభివృద్ధి అధికారి లెంకల గీతారెడ్డి, యంపిఓ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి రద్దు

**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 17 వరకు గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని అప్పటివరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని, అందువలన జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులు సమర్పించేందుకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావద్దని విజ్ఞప్తి చేశారు.

## బహుజనులకు రాజ్యాధికారం



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** బహుజన సామాజ్‌వాది పార్టీతోనే బహుజనులకు రాజ్యాధికారం అందుతుందని ఆ పార్టీ తుంగతుర్తి నియోజక వర్గ ఉపాధ్యక్షులు కొమ్ము జయరాజ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అన్నారం గ్రామం నుండి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసి మాట్లాడారు. రాష్ట్రంలో అణగారిని వర్గాల హక్కుల కోసం బిఎస్‌పి నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బహుజన జెండా ఎగరవేస్తామన్నారు. గ్రామాభివృద్ధి కోసం తనను గెలిపించాలని కోరారు.

## న్యూస్‌లో ఎల్లో కలర్ డే..

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని యాట కన్నా రెడ్డి కాలనీలోని న్యూస్ పాఠశాల వారి న్యూస్ కిడ్స్ ప్లేమెట్‌లో ఎల్లో కలర్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పాఠశాల చైర్మన్ గంట్ల అనంతరెడ్డి తెలిపారు. చిన్నారి విద్యార్థులు ధరించిన ఎల్లో కలర్ దుస్తులతో ఎంతగానో ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన చార్టు, పండ్ల నమూనాలు ప్రదర్శించి వాటి ఉపయోగం గురించి వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కిడ్స్ ప్లేమేట్ ప్రిన్సిపల్ అలుగుబెల్లి స్పందన బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, హెడ్ మిస్ట్రెస్ గంట్ల పద్మ, ప్రిన్సిపల్ అలుగుబెల్లి తిరుమల్ రెడ్డి ఉన్నారు.



# రైతు డబ్బును కాజేసిన దొంగ...

### సకాలంలో స్పందించిన ఆర్‌టిసి, పోలీసు అధికారులు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఆరుగాలం కష్టపడి పండించిన తన పంటను అమ్ముకొని వచ్చిన డబ్బులతో తన స్వగ్రామానికి వెళ్ళేందుకు బస్సు ఎక్కుతున్న రైతు డబ్బును ఓ దొంగ కొట్టివేయగా సకాలంలో అధికారులు స్పందించి తిరిగి డబ్బు ఇప్పించిన సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో శనివారం చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట ఆర్‌టిసి కొత్త బస్టాండ్‌లో మద్దిరాల మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన రామగిరి రాములు వడ్లు అమ్ముకున్న డబ్బులతో తన స్వంత గ్రామానికి వెళ్ళేందుకు తొర్రూరు బస్సు ఎక్కుతుండగా అతని జేబులోంచి రూ.44 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తి దొంగలించాడు. అది గమనించిన రాములు లబోదిబోమని అరువగా తోటి ప్రయాణికులు అది గమనించి దొంగను వెంబడించారు. వారికి చిక్కకుండా పారిపోతూ బస్టాండ్ ఆవరణలో డబ్బులు వదిలేసి పారిపోయాడు. అది గమనించిన ఓ ప్రయాణికుడు విధి నిర్వహణలో ఉన్న కండక్టర్‌కి సమాచారం ఇవ్వగా కింద పడేసిన డబ్బులను బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్‌టిసి స్టేషన్ మేనేజర్ ఆర్‌వి సింగ్‌కు అట్టి డబ్బులను అందజేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు బస్టాండ్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ యండి అప్సర్, ఆర్‌టిసి స్టేషన్ మేనేజర్ చేతుల మీదుగా బాధితుడు రాములుకి అట్టి డబ్బును అందజేశారు. సమయానికి స్పందించి తన డబ్బులను ఇప్పించడంలో కృషి చేసిన ప్రయాణికులకు, ఆర్‌టిసి, పోలీస్ సిబ్బందికి రైతు కృతజ్ఞతలు తెలిపారు. డబ్బులు పోవడంతో కన్నీరుమున్నీరైన రైతు అట్టి డబ్బులు తిరిగి రావడంతో అతని ఆనందాన్ని చూసిన తోటి ప్రయాణికులు సహకరించిన వారికి అభినందనలు తెలిపారు.

## దివ్యాంగులకు ఆత్మవిశ్వాసం, క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం



**ప్రజాపక్షం/యాదాద్రి :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు, వికలాంగులు , వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలు నిర్వహించబడినవి. ఈ కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా క్రీడల అధికారి ధనుంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రన్నింగ్ రేస్, షాట్పుట్, చెస్, క్యారమ్, జావెలిన్ త్రో వంటి క్రీడా పోటీలు నిర్వహించబడ్డాయి. పోటీలను అండర్ 18, మరియు 18 అబోవ్ దివ్యాంగులకు ప్రభుత్వ జూనియర్ బాలుర కాలేజీలో నిర్వహించబడింది. ఇందులో మొదటి బహుమతి పొందిన వారిని దివ్యాంగుల , వయోవృద్ధుల శాఖ, హైదరాబాద్ వారికి పంపడం జరుగుతుంది. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు మాట్లాడుతూ దివ్యాంగుల ప్రతిభను వెలికితీయడం, వారిలో ఆత్మవిశ్వాసం మరియు క్రీడా స్పూర్తిని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల అసోసియేషన్స్, జిల్లా స్థాయి కమిటీ మెంబర్స్ , దివ్యాంగుల స్త్రీ పురుషులు, పీడీలు, పీఈటిలు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనవరి నుండి పోచంపల్లికి సబర్బన్ బస్సులు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** విద్యార్థులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్‌పోచంపల్లి మధ్య జనవరి నుండి సబర్బన్ బస్సులను నడుపుతామని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ బృందం తెలిపారు. శనివారం రవాణా సౌకర్యాలు లేక ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్య దృష్ట్యా ఎండిని కలిసి సమస్యను వివరించి వినతి పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. అడిగిన వెంటనే స్పందించి త్వరలో బస్సులు నడుపుతామని భరోసా ఇచ్చినట్టు తెలిపారు. కొన్ని నెలల నుండి తాము ప్రజా ప్రతినిధులను ఆర్టీసీ అధికారులను కలిసి పలు మార్లు వినతి ఇచ్చిన దరిమిలా హామీ ఇచ్చినందుకు పోచంపల్లి మండల ప్రజల తరఫున ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ యువజన నాయకులు బిజిలీ కుమార్, కడవేరు వెంకటేష్, సీత కృష్ణ, వేముల ఆనంద్, భారత గిరివాసు వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో ఉన్నారు.

## బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** డిసెంబర్ 1 నుంచి జరిగే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు వెంటనే పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టి ఆమోదించాలని కోరుతూ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ప్రధానమంత్రి మోడికి లేఖ రాసినట్లు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చట్టంచేసి కేంద్రానికి పంపిందని దాన్ని యదావిధిగా పార్లమెంట్‌లో చట్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాత్రికి రాత్రి ఈడబ్లుఎస్ పేరుతో అగ్రకులాలకు పది శాతం రిజర్వేషన్ల కోసం చట్టం చేసిన కేందరం బీసీల పట్ల సవతితల్లి ప్రేమ చూపించడం సరికాదన్నారు. రాజకీయ అధికారం ద్వారా బీసీలకు అభివృద్ధి సాధ్యమని, అందుకు న్యాయమైన వాటా కోసం రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం కల్పించాలని కోరారు.

## పిఆర్‌సిని తక్షణమే అమలు చేయాలి

**ప్రజాపక్షం/కోదాడ :** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోదేశి రామారావు అన్నారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలో జరిగిన టిపియూయస్ మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీఆర్సీ కమీటి గడువు ముగిసి రెండు సంవత్సరాలు గడుస్తున్న పెరిగిన ధరలకు అనుగుణంగా ఫిట్మెంట్ ప్రకటించి నూతన పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల అధ్యక్షులుగా నవీన్, కార్యదర్శిగా కొండపల్లి వేణుగోపాలరావులను ఏన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సుందరి శ్రీనివాసరావు, సుధాకర్, ఫణికుమార్, నాగేశ్వరావు, శ్రీనివాస్, శ్రీధర్, నరేష్, నవీన్‌కుమార్, రామకృష్ణలు పాల్గొన్నారు

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** మండల పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చలికంటి నరేష్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చట్టవిరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహించడం, అనధికారిక మద్యం విక్రయాలు జరపడం పూర్తిగా నిషేధం ఉన్నట్లు తెలిపారు. అధికారికంగా ఉన్న మద్యం షాపులు కూడా నిర్ణయించిన సమయాల్లో మాత్రమే పనిచేయాలని, ఎన్నికల ప్రక్రియపై ఎలాంటి ప్రభావం చూపేలా అక్రమంగా మద్యం సరఫరా లేదా పంపిణీ చేయకూడదని స్పష్టం చేశారు. గ్రామాలు, వాడలు, కాలనీలు, ప్రధాన రహదారులపై ప్రత్యేక నిఘా టీంలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ పెంచినట్లు వివరించారు. ఎవరైనా చట్ట వ్యతిరేకంగా వ్యవహరించి బెల్ట్‌షాపులు నిర్వహించడం, గోప్యంగా మద్యం అమ్మడం, నిల్వ ఉంచడం వంటి ప్రయత్నాలు చేస్తే వారిపై చట్టరిత్యా తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నామినేషన్ కేంద్రం సందర్శన



**ప్రజాపక్షం/మోతె :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని మండల ఎన్నికల అధికారి తిప్పని ఆంజనేయులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల నియమావళి ప్రకారంగా రెండవ దఫా ఎన్నికల ప్రక్రియ ఆదివారం ఉదయం 10.30 గంటలకు నామినేషన్ మొదలవుతుందని సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ డిసెంబర్ 2వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు నామినేషన్‌కు కావాల్సిన ప్రతి పత్రం సమర్పించాలని సర్పంచ్ జనరల్ అభ్యర్థులు రూ.2వేలు, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు రూ. 1 వెయ్యి, వార్డు సభ్యులు రూ.250లు నామినేషన్ రుసుము చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యం వెంకన్న, గ్రామ పంచాయితీ కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

## ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వచ్చే నెల 14న నిర్వహించే ఎన్నికలకు సంబంధించి అధికారులకు శనివారం పట్టణంలోని రైతువేదికలో సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీవో శేషగిరిశర్మ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు ఎన్నికల విధులపై అవగాహన కలిగి ఉండి ఎన్నికలను ప్రశాంతంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించడానికి ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు గుడిపాటి కోటయ్య ద్వారా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలు, జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు గుడిపాటి కోటయ్య, ఎంపీవో రమేష్, మండల పరిషత్ సూపరింటెండెంట్ కరుణాకర్, సిబ్బంది ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.





## నామినేషన్ సెంటర్ల పరిశీలన డిఎస్పి

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** స్థానిక ఎన్నికలు సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ ప్రకీయ చివరి రోజు కావడంతో శనివారం నార్కట్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయానికి సందర్శించి అభ్యర్థుల నామినేషన్ వీధి విధానాలను నల్లగొండ డిఎస్పి కొలను శివరాం రెడ్డి పరిశీలించారు. ఆయన వేంట ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ ఉన్నారు.

## మహా మండలపూజ



**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** పట్టణంలోని ఎస్ఎల్ బీసీ లోని నీలగిరి ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం ధ్వజారోహణ మహా మండల పూజ కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది స్వాములు పాల్గొని అయ్యప్ప పూజలు నిర్వహించారు అనంతరం స్వాములకు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బీరవెల్లి గోపాల్ రెడ్డి, అర్చకులు పెన్నా సుబ్రహ్మణ్య శాస్త్ర, మాజీ కౌన్సిలర్ చిన్నాల అలివేలు జానయ్య,కందికొండ శ్రీనివాస్,ఆమనగంటి బిక్షా రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీహరి,మాలే సతీష్ రెడ్డి, కంజర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుండి సస్పెండ్

**ప్రజాపక్షం/మునగాల:** బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న కారణంగా ఓ వ్యక్తిని సస్పెండ్ చేసినట్లు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తొగరు రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న కారణంగా పార్టీ క్రమశిక్షణలో భాగంగా మండల పరిధిలోని తాడ్వాయి తండా గ్రామానికి చెందిన నాయకుడు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మాలోతు లక్యానాయక్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ విధమైన వ్యతిరేక కార్యకలాపాలకు ఎవ్వరు పాల్పడిన ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## పారదర్శకంగా నామినేషన్లు

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు రెవిన్యూ డివిజన్‌లో గ్రామపంచాయితీలకు జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా మొదటి విడత ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియను శనివారం చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. చండూరు మండలంలోని కస్తాల ,గుండ్రపల్లి ,బంగారిగడ్డ ,దోనిపాముల కేంద్రాలను పరిశీలించారు. సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ కేంద్రాలకు చేరుకున్న అందరికి నామినేషన్ వేసే అవకాశం కల్పించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. చండూరు ఎంపిడిఓ యాదగిరి, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.



## పోలీస్ కిష్టయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** తెలంగాణ మలి దశ ఉద్యమంలో తన ఆత్మ బలిదానంతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని ముదిరాజ్ మహాసభ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరి పట్టణంలో డిసెంబర్ 1న నిర్వహించే పోలీస్ కిష్టయ్య సంస్కరణ దిన వర్ధంతి వాల్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ నాయకులు పెంట నరసింహ, కొలుపుల హరినాథ్, ఇట్ట బోయిన గోపాల్‌లు మాట్లాడుతూ డిసెంబర్ 1న గ్రామాల్లో, మండల కేంద్రాల్లో, జిల్లా కేంద్రాల్లో అమర స్తూపాల వద్ద పోలీస్ కిష్టయ్య సంస్మరణ దిన వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పోలీస్ కిష్టయ్య విగ్రహాన్ని రాజధానిలోని ట్యాంక్బండ్ పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహాసభ నాయకులు కుక్కదుగు సోమయ్య, సాదు విజయ్, గొర్రెంకల శివశంకర్, ఎనబోయిన జహంగీర్, ఉడుత భాస్కర్, మాటూరి అశోక్, పిట్టల బాలరాజు, దిడ్డికది భగత్, కమ్మ వెంకటేష్,బోయిని బాలయ్య, షాగంటి నర్సింహ, గుర్రాల మల్లేష్, యాట కుమార్, మౌటం రవి, గుర్రాల శివ నాగేందర్, కనక బాలరాజు, శ్రీశైలం పాల్గొన్నారు.

## గాడిదలకు బ్యానర్లు కట్టి వినూతంగా నిరసన ప్రదర్శన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బీసీలకు చట్టబద్ధంగా ఇస్తామన్నా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోగా, బీసీలను నమ్మించి మోసం చేయాడని నిరసిస్తూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గల గడియారం సెంటర్‌లో బిసి మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎంపీలు ,ఎమ్మెల్సీలు,తక్షణమే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గాడిదలకు బ్యానర్లు కట్టి నిరసన ప్రదర్శన చేశారు.ఈసందర్భంగా బీసీ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు అయితగోని జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు చట్టబద్ధంగా ఇస్తామన్నా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోగా, బీసీలను నమ్మించడానికి తమ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం నుండి 60 శాతం వరకు జనరల్ స్థానాల్లో కూడా అవకాశం కల్పిస్తామని కాంగ్రెస్, బిజెపి పార్టీలు ప్రకటించాయని, కానీ ఆచరణలో అమలు చేయడానికి కనీస కసరత్తు కూడా చేయడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు చిలకరాజు సతీష్‌కుమార్, మార్గం సతీష్‌కుమార్, కన్వీనర్ కర్నాటి యాదగిరి,పుట్ట వెంకన్న గౌడ్,గజ్జి అజయ్ కుమార్ యాదవ్, అనంత నాగరాజు గౌడ్, గడగోజు విజయ్, చెన్నోజు రాజు,దొడ్డు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ మహా గాయత్రి హోమం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని పెండ్లీపాకుల గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకుడు గణేష్ శర్మ ఆధ్వర్యంలో మద్దిమడుగు పీఠాధిపతి శ్రీ కేతావత్ జయరాం గురుస్వామి పర్యావేక్షణలో నవగ్రహ పూజ, ఆంజనేయస్వామికి అభిషేకం, శ్రీ హనుమాన్ గాయత్రి హోమం, మహా పడిపూజలను వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ఎస్సీ, ఎస్టి కమిషన్ మెంబర్ నేనావత్ రాంబాబునాయక్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్‌నాయక్, మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్‌యాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్ధ, ప్రసాదాలు తీసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలని అన్నారు. ఈకార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు రాయప్రోలు మురళిశర్మ, గురుస్వాములు మహేశ్వరం శివయ్యాచారి, బత్తుల పరమేష్, భూతరాజు ఆంజనేయులు, కృష్ణయ్య, అనిల్‌కుమార్, శేఖర్, యాదయ్య, వెంకటనర్సు, హనుమాన్ దీక్షా స్వాములు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహశీల్దార్ ధరావత్ లాలు నాయక్, ఎస్ఐ కస్తాల గోపికృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 రోజుల బాల్య వివాహ నిరోధక కార్యాచరణలో భాగంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ, మండల కమ్యూనిటి సోషల్ మొబిలైజర్ ఒగ్గు సోమన్న ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడుతూ బాల్యం అమూల్యమైనదన్నారు. బాల్య వివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. 2030 నాటికి బాల్యవివాహాలు లేని దేశంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. అనంతరం విద్యార్థులచే బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు కృష్ణయ్య, రఫియాబేగం, సంధ్యారాణి, పద్మ, విజయకుమారి పాల్గొన్నారు.

## నేటి నుండి రెండో విడత నామినేషన్ల స్వీకరణ

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని 34 గ్రామపంచాయతీలకు రెండో విడతలో డిసెంబర్ 14న తేదీన ఎన్నికలు జరగనున్న గ్రామాలకు నేటి నుండి డిసెంబర్ 2 వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారు. ఇందుకోసము 10 నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. బీబీనగర్‌లో బీబీనగర్, రహీంఖాన్ గూడెం, వెంకిర్యాలలో, వెంకిర్యాల, మక్తానంతరం, పడమటి సోమవారం, పల్లెగూడెం, బ్రాహ్మణ పెల్లి, లక్ష్మీ దేవి గూడెం, రాఘవపురం, జమిలపేట, జమిలాపేట, జియాపల్లి తండా, కొండమడుగు, కొండమడుగు, మహాదేవపూర్, జైనపల్లి, నెమరుగముల, రాయరావుపేట, మీది తండా, గూడూరు, అన్నం పట్ల, ఎర్రబెట్టి తండా, గుర్రాల దండి, నీలి తండా, పెద్ద పలుకు తండా, జంపల్లి, చిన్న రావులపల్లి, బట్టుగూడం, రామునిగుండ్ల తండా, రుద్రవెల్లి, మగ్గంపల్లిలో, రవిపహడ్, గొల్లగూడెం, మాదారం పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యులు నామినేషన్లు దాఖలు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం 3వ తేదీన పరిశీలన 6వ తేదీన ఉపసంహరణ అని ఆయన తెలిపారు.

## నేటి నుండి నామినేషన్ పత్రాల స్వీకరణ

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** తిరుమలగిరి మండలంలోని రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ 30 నుండి డిసెంబర్ 2 మంగళవారం వరకు మూడు రోజులు నామినేషన్ పత్రాలు స్వీకరించ బడతాయని, సర్పంచ్ నామినేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంపీడీవో బిక్షమయ్య తెలిపారు, మండల పరిధిలోని సర్పంచ్ వార్డ్ సభ్యుల నామినేషన్ స్వీకరణలను మొత్తం ఏనిమిది నామినేషన్ క్లస్టర్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు,ఆయన క్లస్టర్ వారిగా నామినేషన్ వివరాలు తెలుపుతూ క్లస్టర్1 లో అల్వాల, తిట్టకుంట, శ్రీరాంపురం, పెద్దబావి తండా, క్లస్టర్2 లో తిరుమలగిరి,రంగుండ్ల, ,తోటిపేట తండా, ఎల్లాపురం, క్లస్టర్3 లో కొంపల్లి చిల్కాపురం, ఎల్లాపురం తండా, సుంకి శాల తండా, క్లస్టర్4 రాజవరం ,జూవిచెట్టు తండా, బోయగూడెం, గట్టుమీద తండా, క్లస్టర్5 లో గరకనేటి తండా తునికి తునికి నుత్తుల, కిచ్చ తండా, తిమ్మాయపాలెం, నాయకుని తండా, క్లస్టర్6లో మేఘ్యు తండా,శీతల తండా, నేతాపురం ,ధన్సింగ్ తండా క్లస్టర్7లో బట్టు ఎంకన్న బావి తండా, చింతలపాలెం ,నాగార్జున పేట, సభావత్ తండా,గోడుమడక, క్లస్టర్8 లో జాల్ తండా, నెల్లికల్,ఎర్ర చెరువు తండా, చెంచువాని తండా , పులిగుండ్ల తండ గ్రామాలు ఉన్నాయని తెలిపారు.

## రాత్రి వరకు నామినేషన్లు



**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలో 28 గ్రామ పంచాయతీల సర్పంచ్ వార్డ్ మెంబర్ల పోటీకి శనివారం ఆఖరి రోజు కావడంతో భారీ ఎత్తున నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు క్యూలైన్ లో నిలబడి రాత్రి వరకు నామినేషన్లు దాఖలు వేశారు. నామినేషన్ వేసేందుకు నూతన బ్యాంక్ అకౌంటు తప్పనిసరిగా కావడంతో నూతన అకౌంట్ తీసి భారీగా సాయంత్రం మూడు నుంచి నాలుగు మధ్య నామినేషన్ వేసి ఎందుకు అభ్యర్థులు భారీగా క్యూ లైన్లో నిలబడే సరికి అధికారులు టోకెన్ల ద్వారా రాత్రి వరకు నామినేషన్ వేసేందుకు వెసులుబాటు కల్పించారు.నామినేషన్ల ప్రక్రియను చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి,ఎంపీడీవో యుగేందర్, తాహసిల్దార్ నరేష్‌లు పరిశీలించారు. నామినేషన్ సెంటర్ల వద్ద పటిష్టం బందోబస్తును మునుగోడు ఎస్ఐ రవి ఏర్పాటు చేశారు.

## బిజెపితో పొత్తు పెట్టుకున్న పార్టీలను ఓడించాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** బిజెపితో పొత్తు పెట్టుకున్న తొత్తు పార్టీలను ఓడించి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ కోరారు. శనివారం మండల పరిధిలోని వెంపటి గ్రామం నుండి సిపిఎం పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా జాజుగల్ల ముత్తయ్య నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎనగందుల విష్ణుమూర్తి, గోవిందాచారి, మడిపెద్ది యాదగిరి, జాజుగల నాగయ్య పాల్గొన్నారు.

# కెసిఆర్ దీక్షతోనే తెలంగాణ



**ప్రజాపక్షం/హాలియా:** కెసిఆర్ అకుంఠిత దీక్షతోనే తెలంగాణ రాష్ట్ర కల సాకారం అయిందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. దీక్ష దివస్ పురస్కరించుకొని శనివారం హాలియాలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ సాధన కోసం అమరులైన వారికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు పార్టీ కార్యాలయం వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భగత్ మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన దీక్ష ఉద్యమాల ఫలితమే ఈరోజు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కారణం అయిందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఇస్లావత్ రామచంద్రనాయక్,పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు,వడ్డే సతీష్ రెడ్డి,సురభి రాంబాబు,నల్గొండ సుధాకర్,జవ్వాజి వెంకటేశ్వర్లు,పిడిగం నాగయ్య,రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరగనున్న దీక్షా దివాస్ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో శనివారం మిర్యాలగూడ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకుంటూ సుమారు 200కార్లలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దీక్షాదివాస్‌కు బయలుదేరగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు వాహన శ్రేణికి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో యడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, అన్నభీమోజు నాగార్జునచారి, నల్లమోతు సిద్దార్థ, ఎండి.మగ్దుంపాషా, ఇలియాస్‌ఖాన్, మాజీద్, షోయబ్, పశ్యా శ్రీనివాస్‌రెడ్డి, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, పునాటి లక్ష్మీనారాయణ, గుడిసె దుర్గాప్రసాద్, ముబిన్, నంద కిశోర్, నాగరాజు, కిరణ్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దీక్షాదివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న నినాదంతో కేసీఆర్ తలపెట్టిన దీక్షా దివాస్ కార్యక్రమం సందర్భంగా పట్టణ కేంద్రంలోని సభాష్ సెంటర్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అదేవిధంగా ఆసుపత్రిలోని పేషెంట్లకు అరటి పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బందెల రాములు, మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, సుధీర్‌బాబు ఉన్నారు.



**ప్రజాపక్షం/నందికొండ:** బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పైలాన్ అమరవీరుల స్థూపం వద్ద దీక్షా దివస్‌ను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారులు మాజీ కౌన్సిలర్ హీరేకార్ రమేష్ జి,సీనియర్ నాయకులు సయ్యద్ గౌస్,సయ్యద్ మక్షుద్,లక్ష్మణ్ నాయక్,చంద్రమౌళి నాయక్, సైదులు, దేశ్య నాయక్,రామస్వామి,హనుమంతు, శ్రీను, శాంత,ఎంకోజిలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** దీక్షా దివస్ సందర్భంగా ఎంజి యూనివర్సిటీలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన కార్యక్రమానికి తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిశోర్ కుమార్ హాజరై ప్రసంగించారు. కేసీఆర్ పోరాటం, తెలంగాణ ఉద్యమ నాటి జ్ఞాపకాలను విద్యార్థులకు గుర్తు చేశారు. భవిష్యత్తులో ఈ కాంగ్రెస్ పార్టీ గద్దెను దించి, మళ్ళీ తెలంగాణ జాతిపిత కెసిఆర్ ని ముఖ్యమంత్రి చేసుకునే వరకు పోరాటం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్ రెడ్డి,బిఆర్ఎస్‌వి రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల సతీష్, రాష్ట్ర కార్యదర్శి నాగార్జున్,యూనివర్సిటీ అధ్యక్షులు వాడపల్లి నవీన్,ఆస్ట్రేలియా యూత్ ప్రెసిడెంట్ వినయ్ సన్నీ, గాదె శివ,రంజిత్,పోలగోని శివ, సుధీర్, శేఖర్, అవినాష్ ఇమ్రాన్ పాల్గొన్నారు.






## సిపిఐ అభ్యర్థులను గెలించాలి

**ప్రజాపక్షం/గుండాల;** స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా నిలబడే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జనగాం జిల్లా సహాయ కార్యదర్శి, అనంతారం మాజీ సర్పంచ్ ఆది సాయన్న ఓటర్లను కోరారు. శనివారం మండల పరిధిలోని అనంతారం గ్రామంలో సిపిఐ శాఖ సమావేశానికి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలని ఆయన సిపిఐ కార్యకర్తలకు సూచించారు. ఈసమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, కార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి, స్వామి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## పోలీస్ శాఖలో సేవలందించడం అభినందనీయం



**ప్రజాపక్షం/సూర్యాపేట** : పోలీస్ శాఖలో సుదీర్ఘ సేవలు అందించడం అభినందనీయమని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న పులి వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి ఏఎస్ఐ కృష్ణారెడ్డి, ఇస్మాయిల్‌లు స్వచ్ఛంద పదవీ విరమణ చేయగా, ఆత్మకూర్(ఎస్) పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేసిన జానకిరాములు పదవీ విరమణ పొందగా వారిని కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి నరసింహ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సమాజ సేవ కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, ఏఆర్ అదనపు ఎస్‌పి జనార్థన్ రెడ్డి, ఏఆర్ డిఎస్‌పి నర్సింహాచారి, అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజుభార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎస్ఐ రాంచందర్ పాల్గొన్నారు.

## చార్జింగ్ దీపాల బహుకరణ

**ప్రజాపక్షం/హాలియా:** హాలియాలోని మహాత్మ జ్యోతిబాయ్ పూలే పాఠశాలకు హాలియాకు చెందిన బల్మూరి చందన పుట్టినరోజు పురస్కరించుకొని ఆమె చర్య పాఠశాలకు చార్జింగ్ దీపాలను బహుకరించారు. శనివారం హాలియా కు చెందిన బల్మూరి శ్రీశైలం గౌడ్ కూతురైన బల్మూరి చందన మహాత్మ జ్యోతిబాయ్ పూలే పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. అయితే శనివారం ఆమె పుట్టినరోజును పురస్కరించుకొని ఆమె విద్యను అభ్యసించే పాఠశాలలో విద్యార్థులు , ఉపాధ్యాయుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా చందన తండ్రి శ్రీశైలం గౌడ్ తన కూతురు పుట్టినరోజును పురస్కరించుకొని ఆమె విద్యను అభ్యసించే పాఠశాలకు చార్జింగ్ దీపాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లి తండ్రి విద్యార్థులకు హాని చేసే వివిధ రకాల చాక్లెట్లను ఇప్పించ కుండా వాటికి బదులుగా అందరికీ ఉపయోగపడే ఇలాంటి బహు మతులు పాఠశాలకు అందజేయాలని కోరారు.




## అకడమిక్ ఆడిట్ బృందం సందర్శన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం అకాడమిక్ ఆడిట్ బృందం సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.భీమార్జున్ రెడ్డి తెలిపారు. కమీషనరేట్ ఆఫ్ కాలజ్ ఎట్ ఎడ్యుకేషన్ హైద్రాబాద్ వారి ఆదేశాల మేరకు 202223, 202324 సంవత్సరాలకుగాను కళాశాలలోని మౌలిక వసతులు, తరగతుల నిర్వహణను పరిశీలించడానికి రామన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రెహత్‌ఖానం, నల్లగొండ మహిళా కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ వెంకటకృష్ణలు కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి అన్నిరకాల సదుపాయాలను, వివిద రకాల వసతులను, సైన్స్‌ల్యాబ్‌లను, లైబ్రరీ, స్పోర్ట్స్, ఎన్ఎస్ఎస్, ఎస్‌సీసీ తదితర విభాగాలన్నింటిని, వాటి తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ నాగరాజుని విద్యార్థులు అభినందించార. వచ్చే సంవత్సరం జరగబోయే న్యాక్‌లో మంచి గ్రేడింగ్ సాధించే విధంగా అందరు కృషి చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.




## మండల కుమ్మరి సంఘం అధ్యక్షులుగా కుమారస్వామి



**ప్రజాపక్షం/బీబీనగర్** : మండలంలోని 34 గ్రామాల కుమ్మరి సంఘం కులస్తుల సమావేశం శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి గోపాల్, ధర్పల్లి ప్రవీణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ రాజకీయంగా వెనుకబడిన కుమ్మరి కులస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం జరిగిన సమావేశంలో మండల అధ్యక్షునిగా దేవరుప్పల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా కోలిచేల్మెల మల్లేష్, కోశాధికారిగా నెల్లుట్ల చంద్రవాస్, గౌరవ అధ్యక్షులుగా జీలకపల్లి బసవయ్య, ఉపాధ్యక్షులుగా సిల్వర్ కిషన్, కార్యదర్శిగా నెల్లుట్ల బాలకృష్ణ, ప్రచార కార్యదర్శిగా రాజశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

## ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం** : డిసెంబర్ 14న జరిగే రెండో విడత స్థానిక సంస్థల గ్రామ పంచాయతీ ఎన్నికలకు మండలంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు అంతా పోలీసులకు సహకరించి ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కేశవాపురం క్రాస్ రోడ్డులో అనూష ఫంక్షన్ హాల్‌లో తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ ఏర్పాటు చేసిన మండల రాజకీయ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో డిసెంబర్ 14న జరిగే సర్పంచ్‌ల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటలకు, ఘర్షణలకు పాల్పడవద్దని, పోలీస్ నియమ నిబంధనలను పాటిస్తూ ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన అన్నారు. నామినేషన్లు మొదలుకుని ఎన్నికలు పూర్తయ్యే వరకు మండలంలో 144సెక్షన్ అమలులో ఉంటుందని, గ్రామపంచాయతీలో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు గెలుపోటములు సహజమని, ప్రతిఒక్కరూ గెలిచినా, ఓడినా సహనంతో ప్రశాంతంగా ఉండాలని, ప్రజలను రెచ్చగొడుతూ గొడవలు సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టవద్దని, అలా పోస్టులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని నాలుగు సెక్టార్లల్లో సంబంధిత పోలీస్‌శాఖ అధికారులు ఉంటారని, వారి నెంబర్ ద్వారా ఎలాంటి సమాచారం ఉన్న అందించాలని ఆయన కోరారు.

# రేపు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నూతి సత్యనారాయణ ప్రమాణస్వీకారం

**-హాజరు కానున్న ఉప ముఖ్యమంత్రి, మంత్రులు**
**-వైరా నుండి ఖమ్మం వరకు భారీ ర్యాలీ**



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీకి నూతన అధ్యక్షునిగా నూతి సత్యనారాయణగౌడ్ డిసెంబర్1న ప్రమాణస్వీకారం చేయనున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తెలియజేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన సీనియర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు నూతి సత్యనారాయణ గౌడ్ రేపు మధ్యాహ్నం మూడు గంటలకు కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మ లనాగేశ్వరరావు, రెవిన్యూ శాఖమంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్, మాలోతు రాందాస్‌నాయక్, పలువుర కార్పొరేషన్ చైర్మన్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లో వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**వైరా నుండి ఖమ్మంకు భారీ ర్యాలీ...**

నూతి సత్యనారాయణ ప్రమాణస్వీకారం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు వైరా నుండి వరకు భారీ ర్యాలీతో కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ర్యాలీకి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్‌లో పలువురి చేరిక



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామంలో కాంగ్రెస్‌లో పలువురు చేరారు. శనివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మానుకొండ రాధాకిషోర్ ఆధ్వర్యంలో 130 కుటుంబాలు జిల్లా యూత్ నాయకులు తుమ్మల యుగంధర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి తుమ్మల యుగంధర్ పార్టీ కండువలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంద వెంకటయ్య, బండారు కనకయ్య, టెంటు కనకయ్య, సందా వెంకన్న, దార్న నర్సింహారావు, ఏరువ వెంకటేశ్వర్లు సారధ్యంలో పలు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు.ఈ కార్యక్రమంలో నాయకులు తాతా రఘురాం, గుడిపూడి రామారావు, రెంట్యాల ప్రసాద్, బోయన వెంకటనర్సయ్య, గాజుల కృష్ణారావు, నంద్యా, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారూ.. మాకు న్యాయం చేయండి

**-రైల్వే మూడవ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా రాయల్ లాడ్జి బిల్డింగ్ తొలగింపు**
**-బిల్డింగ్‌కు నష్టపరిహారం అందించిన ప్రభుత్వం**
**-ఆ బిల్డింగ్‌కు నలుగురు వాటాదారులుగా ఉండగా, ఒకరికి అందని పరిహారం**
**- అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం**
**- బెదిరిస్తున్న వాటాదారుడైన లాయర్**
**-బాధితుడు మనస్థాపానికి గురై గుండెపోటుతో మృతి**
**-తమకు న్యాయం చేయాలంటున్న బాధిత కుటుంబికులు**




**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని ప్రధాన రైల్వే గేటు పక్కన ఉన్న రాయల్ లాడ్జి బిల్డింగ్‌లో వాటాదారునిగా ఉన్న బిల్లకంటి నాగేశ్వరరావుకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం ఇవ్వకుండా ఇతర వాటాదారులు మోసం చేయటంతో మనస్థాపానికి గురైన ఆయన ఇటీవల గుండెపోటుతోమృతి చెందారు. మధిర పట్టణంలోని సికింద్రాబాద్ విజయవాడ ప్రధాన రైల్వే మార్గంలో రైల్వే మూడవ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా రాయల్ లాడ్జి బిల్డింగ్‌లోని కొంత భాగాన్ని తీసుకోగా తీసుకున్న స్థలానికి, పాత బిల్డింగ్ కావటంతో కూలిపోయే ప్రమాదం ఉందని బిల్డింగ్ మొత్తానికి రైల్వే అధికారులు నష్టపరిహారం చెల్లించారు. ఈ బిల్డింగ్‌లో వాటాదారునిగా ఉన్న బిల్లకంటి నాగేశ్వరరావు 12417/1 రిజిస్ట్రేషన్ డ్యాకుమెంట్ కలిగిన 21 గజాల రెండు గదులు ఉన్నాయి. గత 30 సంవత్సరాలుగా ఇంటి పన్ను, కరెంట్ బిల్లు కడుతున్నాడు. అయితే రైల్వే అధికారులు శిథిలావస్థకు చేరిన రాయల్ లాడ్జి బిల్డింగ్‌ను కూల్చి వేయాలని బిల్డింగ్ మొత్తానికి పెద్ద మొత్తంలో నష్టపరిహారం చెల్లించారు. ఈ నష్టపరిహారం చెల్లింపు విషయంలో జరిగిన సర్వేలో నలుగురు వాటాదారులుగా ఉన్న బిల్డింగ్‌లో మిగతా ముగ్గురు వాటాదారులు ఈ బిల్డింగ్ మొత్తం మాదేనని వారి దగ్గర ఉన్న పాత డాక్యుమెంట్లను చూపించి అధికారులను మభ్యపెట్టి నాల్గొవ వాటాదారుడిగా ఉన్న బిల్లకంటి నాగేశ్వరరావుకు నష్టపరిహారం రాకుండా చేశారని బాధిత కుటుంబం ఆరోపించింది. దీనిపై గత సంవత్సర కాలంగా తమకు నష్టపరిహారం చెల్లించాలని అధికారులు చుట్టూ తిరిగినా పట్టించుకోవటం లేదని బాధిత కుటుంబ సభ్యులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్డింగ్‌లో వాటాదారునిగా ఉన్న లాయ ర్ మాకు రావాల్సిన నష్టపరిహారం ఇవ్వాలని అడుగుతుంటే నేను న్యాయవాదిని నీవు ఎక్కడైనా చెప్పుకో, అవసరమైతే మిమ్మల్ని మెడపట్టి బయటకు గెంటేస్తానని, ఈ బిల్డింగ్‌కు మీకు ఎటువంటి సంబంధం లేదని, మీకు నష్టపరిహారం ఇచ్చేది లేదని, మీ మీద కేసులు పెడుతానని బె దిరింపులకు పాల్పతున్నట్లు బాధిత కుటుంబం లబోదిబోమంటుంది. ఈ తరుణంలో మాకు ఎటువంటి నష్టపరిహారం రాకుండానే మా రెండు గదులను కూల్చివేయాలని మధిర మున్సిపాల్టీ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. తమకు నష్టపరిహారం రాకుండా అధికారులు నోటీసులు ఎలా ఇచ్చారని బాధిత కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వ్యవహారంపై విచారణ జరిపించి తమకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం ఇప్పించటంతో పాటు మాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని బాధిత కుటుంబం ముక్తకంఠంతో కోరుతుంది.


OFFICE OF THE MADHIRA MUNICIPAL COUNCIL, KHAMMAM (Dist.), TELANGANA

Notice u/s sec 182 of the TS Municipal Act, 2019

Dated: [illegible] - 2025

Sir/Madam,

Take notice under Section 182 of TS Municipal Act, 2019 the following portion/Building [illegible] situated at Ward No. 18, Location [illegible] Madhira is in serious condition or likely to fall. You are hereby required as the Owner/Occupier to show cause by submitting your objections if any, within (7) days as to why the same should not be pulled down / Remove / Repair to prevent all causes of danger there from by this office at your expenses. You are entitled to make representation and adduce evidence if any on or before the above-mentioned date. Before removal the pending House and Water Taxes must be cleared.

Commissioner
Madhira Municipality

To
Sri/Smt. [illegible]
Madhira.

# సిపిఐ అభ్యర్థులను, బలపర్చిన వారిని గెలిపించండి

**-సిపిఐలో చేరిన మీరాసాహెబ్**



**ప్రజాపక్షం/ బోనకల్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులతో పాటు, బలపర్చిన వారిని గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో షేక్ మీరాసాహెబ్ సిపిఐలో చేరారు. వారికి తోట రామాంజనేయులు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన పార్టీ సిపిఐ అన్నారు. పేదల అభ్యున్నతికి అనునిత్యం కృషి చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను, బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముష్టికుంట్ల గ్రామంలో ఐదవ వార్డు సిపిఐ అభ్యర్థిగా షేక్ మీరాసాహెబ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగాల ఆనందరావు, కార్యవర్గ సభ్యులు ఆకెన పవన్, శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, ఏఐకెఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కర్‌రావు, సీనియర్ నాయకులు బోయనపల్లి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహణకు మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీలలో 214 పోలింగ్ కేంద్రాలలో మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పించినట్లు అదేవిధంగా మండలంలో మూడో తేదీ నుంచి నామినేషన్ ప్రక్రియ 10 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని అభ్యంతరాలు ఉంటే తెలియపరచాలని పోలింగ్ సిబ్బందికి సూచించినట్లు పేర్కొన్నారు. మండలంలో ఎన్నికల నిర్వహణకు పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిచేయడం జరిగిందని ఆయన వివరించారు.

# చివరి రోజు నామినేషన్ల జోరు






**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి విడత నామినేషన్ల ఘట్టం ముగిసింది. రఘునాథపాలెం మండలంలో శనివారం చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 37 సర్పంచ్ స్థానాలకు, 308 వార్డు స్థానాలకు వివిధ పార్టీల మద్దతుతో పలువురు నామినేషన్లు వేశారు. నామినేషన్ ప్రక్రియ రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. మొత్తం సర్పంచ్ స్థానాలకు 200లకు పైగా, వార్డు స్థానాలకు 700లకు పైగా నామినేషన్లు దాఖలైనట్లు సమాచారం. డిసెంబర్ మూడు వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండడంతో పోటీ చేసే అభ్యర్థులు ఎవరన్నది ఆరోజు తేలనుంది. మండలంలో ప్రధానంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ తరుపున పలువురు అభ్యర్థులు పోటీ చేస్తుండగా బలమున్న చోట సిపిఐ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా పలువురు నామినేషన్‌లు దాఖలు చేసినప్పటికీ ఉప సంహరణ తర్వాత బరిలో ఉంటారో లేదో చూడాలి.

# గ్రామాల్లో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

**-ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు, వాహనదారులు**
**-పట్టించుకోని మిషన్ భగీరథ అధికారులు**




**ప్రజాపక్షం/ఏన్కూరు :** పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్లైన్ లీక్ కావటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని తూతక్క లింగన్నపేట గ్రామంలో ఏన్కూరు నుండి కేసుపల్లి వెళ్లే రహదారి నీళ్లు నిలిచి వాహనదారులకు, గ్రామస్తులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. అదే విధంగా ఆంజనేయ స్వామి ఆలయం నుండి పాఠశాలకు వెళ్లే రహదారిలో గత వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రోడ్డుమీద పారటంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు, పొలాలకు వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ అధికారులకు విషయం తెలిపినప్పటికీ పట్టించుకోవటం లేదని గ్రామస్తులు తెలిపారు. అయినప్పటికీ స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు స్పందించి పైప్లైన్ లీకేజీలను బాగు చేయించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.